పుస్తకం మూసి తలెత్తాను.

గొంతుదాకా రగ్గు కప్పుకుని, మొహం, చేతులు మాత్రం బయటపెట్టి, 'వేలీ ఆఫ్ డాల్స్' చదువుకుంటున్నాడు వాసు.

వాడికి దూరంగా మరో మంచం మీద దిండుకి ఆనుకుని కూర్చుని, 'సత్యాత్మ మోక్షసాధన' దీక్షగా చదువుతున్నాడు శరత్.

బయట జోరుగా వర్షం!

గదిలో గాలిని కొద్దిగా వెచ్చబరచాలనిపించింది.

"శరత్!" పిలిచాను.

"..."

"ఒరేయ్ శరత్! నిన్నే!"

తలెత్తకుండానే "ఊ" కొట్టాడు.

"నువ్వెప్పుడైనా, ఏ అమ్మాయినైనా ప్రేమించావా?"

నేనాశించిన కదలిక వచ్చింది.

రగ్గుని అవతలికి తన్నేసి, హుషారుగా లేచి కూర్చున్నాడు వాసు.

పుస్తకం మూసి తలెత్తి, "ఏవిటి?" అన్నాడు శరత్.

"నీకెవరైనా గర్ల్‌ఫ్రెండ్సు వున్నారా అని అడుగుతున్నాడు వాడు" చెప్పాడు వాసు.

"గర్ల్‌ఫ్రెండ్సుండటాన్ని ప్రేమించడమంటారా?" అమాయకంగా అడిగాడు.

"తెలివితేటలు ప్రదర్శించావంటే తంతాను! అడిగినదానికి సరిగ్గా సమాధానం చెప్పుముందు!"

"ప్రేమ!" కళ్ళు మూసుకున్నాడు వాసు. ముఖం నిండా తాదాత్మ్యత నింపుకుని చెప్పాడు.

"అదొక అనిర్వచనీయమైన భావం, అందమైన అనుభూతి!"

"అంటే? వివరించాలి"

"ఎప్పుడైనా, ఏ అమ్మాయికేనా తదేకంగా చూడాలనీ, మాట్లాడాలనీ, దగ్గరగా కూర్చుని కబుర్లు చెప్పాలనీ అనిపించిందా?"

"అనిపించింది!"

"అదే ప్రేమంటే!"

"కానీ దాన్ని ఆకర్షణ అని కదూ అంటారు?"

గతుక్కుమన్నట్లు చూసాడు వాసు.

గొంతు సద్దుకున్నాను. "మామూలుగా చూడాలనీ, మాట్లాడాలనీ కాదురా! ఆమె మాట్లాడుతూంటే గంటలు గంటలు వింటూండిపోవాలనీ, ఆమెతోటి పరిచయాన్ని పెంచుకుని స్నేహం చెయ్యాలనీ, ఆమెకి నచ్చిన పనులు చెయ్యాలనీ అనిపించడం!"

"దాన్ని అభిమానమనీ, ఇష్టమనీ అంటారు కదరా!"

నేను అభావంగా వాసు వంక చూసాను.

"వీడికిలా తేల్గ్గా చెప్తే తెలియదురా!" నాతో అని, బలంగా వూపిరి పీల్చాడు, "వినరా శరత్! ఆమె మాట వింటే కోయిలపాట, ముఖం చూస్తే చంద్రబింబం, ఆమె మంజీర నాదాలు వింటే జేగంటలూ గుర్తుకు వస్తాయి. ఆమె సామీప్యం అభివ్యక్తీకరించలేని అనుభూతినిస్తుంది. నీ అనురాగపు అంబరాల్లో, ఆమె ఆనందపుటంచులను గమనిస్తే..." శరత్ మధ్యలోనే అన్నాడు విసుగ్గా. "అది ఆరాధన!"

మింగేసేట్టు చూసాడు వాసు.

"నేనా తక్కువ?!" "ఒరేయ్! ఇంకా వివరంగా చెప్తాను విను. నీ ప్రేయసి తాలూకు వియోగంలోని విషాదమో, ఆమె తోటి కలయికలోని కలవరమో కళ్లనిండా నీటిని తెప్పిస్తాయి. ఆకలిదప్పులు కలగవు, కాలగమనం గ్రహింపుకి రాదు. ఆమె జ్ఞాపకాలు గుర్తుకువస్తే గుండెలు దడదడలాడతాయి. వెన్నెల వెనుబాటవుతే, విరులు విరసాలు అవుతాయి..."

"ఇది విరహం అనుకుంటాను!"

# వాట్ ఈజ్ లవ్!





"తెలుగులో మరీ ఇన్ని పదాలున్నాయేమిట్రా" అన్నాడు వాసు బిక్కమొహం వేసుకుని.

"ఉంటే ఉన్నాయిలేరా! మన దురదృష్టం కాకపోతే, అవన్నీ ఈ శరత్‌గాడికి తెలియడమేవిటి? గాలిని వెచ్చబరచాలని ప్రారంభిస్తే, గాడ్పు కొడుతోంది" క్షణం ఆగి అన్నాను కన్నుగీటి నవ్వుతూ, " ఆ అమ్మాయి మెడవంపు, పెదవి ఎరుపు, నడుంమెలిక, అద్భుతంగా కనిపించడం..."

"ఏడ్చావులే. అది మోహం" నిర్లక్ష్యంగా చెప్పాడు శరత్

వాసు రెండు చేతులతోనూ తల పట్టుకుని, "దేవుడా!" అని అరిచేడు కోపంగా. పళ్ళు బిగించి ముందుకు వంగి, కసిగా చెప్పాడు, "పోనీ, రక్తంతో 'ఐలవ్‌యు' అని వ్రాయాలనిపించడం, ఛాతీ మీద బ్లేడుతో ఆ అమ్మాయి పేరు చెక్కుకోవాలనిపించడం..."

"అది పర్వర్షన్" తాపీగా అన్నాడు శరత్.

నాకు వాసు ముఖం చూస్తే జాలి వేసింది. నవ్వు వచ్చింది. మా ఇద్దరికేసీ అయోమయంగా పిచ్చిచూపులు చూస్తున్నాడు.

'లాభం లేదు. ఈరోజు ఈ విషయాన్ని తేల్చేయాలి' నిశ్చయించుకుని, సిగరెట్ వెలిగించుకుని, పొగ వదులుతూ తీవ్రంగా ఆలోచించసాగాను.

ప్రేమ! లవ్! ప్యార్...ఏవిటి! దాన్ని ఎలా నిర్వచించాలి! మాటల్లో చెప్పలేనంత కఠినమైన అభివ్యక్తా ప్రేమంటే!? వీళ్ళకి కన్విన్స్ చేసేలా ఎలా చెప్పాలి? ఎలా...ఎలా...

హఠాత్తుగా స్ఫురించింది. "తెలిసింది!" అరిచాను.

ఇద్దరూ ఉలికిపడి చూసారు.

"ఒరేయ్! శరత్! నువ్వు చెప్పినవన్నీ సరైన పదాలే! అయితే ఈ ఆకర్షణ, అభిమానం, మోహం, విరహం. పర్వర్షన్ అన్నీ ఒకే వ్యక్తిమీద ఏర్పడడాన్నే ప్రేమ అంటారు!"

వాసు గట్టిగా ఈలవేసాడు. ఒక్క గంతులో మంచం దిగి వచ్చి, నన్ను కౌగలించుకున్నంత పనిచేస్తూ, "శభాష్! శబాష్‌రా!" అన్నాడు అభినందనగా.

శరత్‌కేసి తిరిగాను. వాడు సాలోచనగా చూస్తున్నాడు.

"ఈ అనుభూతులన్నీ ఒకే వ్యక్తిపై కలగడాన్ని ప్రేమంటారా? బానే ఉంది! కానీ ఈ అనుభూతులు ఏ వరుసలో కలగాలిరా?"

దబ్బుమన్న చప్పుడయింది. ఇద్దరం అదిరిపడి చూసాం!

వాసుగాడు వెనక్కి విరుచుకు పడిపోయి వున్నాడు!! ★

అర్చన రాంపల్లి